ఆశాజనకంగా పత్తి

- ప్రస్తుతం కాత దశకు
- త్వరలో పంట చేతికి
- తెగుళ్లు సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



కలమడుగులో పత్తి పంట

జన్నారం: రెండేళ్లుగా పత్తిలో నష్టాలు చవిచూస్తున్న రైతులు ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో వేసిన పంట ఆశాజనకంగా ఉంది. పత్తిపై గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి కాత దశకు చేరింది. త్వరలో పంట చేతికందనుంది. గతేడాది క్వింటాల్ రూ.10 వేలకు పలికిన నేపథ్యంలో తెల్ల బంగారం లాభాలు తీసుకువస్తుందనే ఆశతో అన్నదాతలు ఉన్నారు. మండలంలో ఈ సంవత్సరం 5 వేల ఎకరాల్లో పత్తి సాగైనట్లు అధికారులు తెలుపుతున్నారు. గతేడాది కన్నా ఈఏడాది వరి సాగు పెరిగింది. పత్తి వేసిన తక్కువ పంట అయినా కూడ ఆశించిన రీతిలో ఉండటంతో రైతులు గంపెడాశతో ఉన్నారు. గత సెప్టెంబర్ వరకు వర్షాలు పడటంతో పత్తి పంటకు బలం పెరిగినట్లయింది.

ఏపుగా పెరిగిన మొక్క..

ప్రస్తుతం పత్తి మొక్కలు ఏపుగా పెరిగి పూత, కాత దశకు చేరుకుంది. మండలంలోని కొన్నిచోట్ల పత్తి కాయ పగిలి పత్తి కూడ బయటకు వస్తుంది. కొన్ని చోట్ల చీడపీడల ఉధృతి ఉండటంతో రైతులు క్రిమి సంహారక మందులు ఉపయోగించి పంటను కాపాడుకుంటున్నారు. పూత,కాత దశలో వర్షాలు అధికంగా పడితే తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. నేలలో తేమ ఉండడంతో రైతులు మూడోసారి కింది ఎరువులు, యూరియా, పొటాష్ వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం తెగుళ్ల గులాబీ రంగు పురుగు ఉధృతి గుర్తించేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతుపై మందుల భారం

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పత్తి పంట వేసిన రైతులపై మందుల భారం పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.3 వేలు అదనంగా పెరిగినట్లు తెలుపుతున్నారు. సకాలంలో మందులు కొట్టని పత్తిపై తెగుళ్ల ప్రభావం పడుతుంది. దీంతో రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ పంటలకు మందులు వేసుకుంటున్నారు. అయినా కొన్ని పత్తి చేలలో తెగుళ్ల సోకి రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ రైతులకు నష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

లద్దె పురుగు సోకింది



నేను రెండెకరాల్లో పత్తి చేను వేసుకున్నా. పత్తి ఏపుగా బాగానే పెరిగింది. ఇప్పటికి మూడో మందు వేశా. పత్తి కాత దశకు చేరింది. పంటకు లద్దె పురుగు సోకి మొక్క ఆకులను తినేస్తుంది. పంట బాగా వస్తుందనుకుంటే ఒకేసారి పురుగు సోకడంతో వ్యవసాయ అధికారులను సంప్రదించి పురుగుల మందు పిచికారి చేశాను. పత్తి లాభం తెస్తుందని ఆశతో ఉన్నాను.

– బంద దయాకర్ , రైతు, కలమడుగు

అప్రమత్తంగా ఉండాలి



పత్తి రైతులు పంటను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. పంటకు పురుగు సోకితే వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చి, తగిన మందును కొట్టాలి. ప్రస్తుతం లద్దె పురుగు, గులాబీ రంగు పురుగు సోకే ప్రమాదం ఉంది. రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, తెగుళ్ల సోకితే వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చి, వారు సూచించిన మందులు పిచికారి చేయాలి.

– సంగీత, ఏవో

పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభం



వడ్డిస్తున్న ఎంఈవో తిరుపతిరెడ్డి

దండేపల్లి: మండలంలోని గూడెం, పెద్దపేట ప్రాథమిక పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంఈవో రవీందర్, హెచ్‌ఎంలు కమలాకర్, శ్రీలత, సీఆర్పీలు రమేశ్, సురేందర్, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ఎంఈవో తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం



వేమనపల్లి: మండల కేంద్రంలో గురువారం దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెంకన్నశర్మ, సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారి కలశం గ్రామానికి చెందిన కుర్రు శ్రీనివాస్ రూ.3500 వేలం పాటలో దక్కించుకున్నారు. గ్రామంలో శోభాయాత్ర అనంతరం ప్రాణహిత నదిలో నిమజ్జనం చేశారు.

'ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు'

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో గల ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థి తల్లి శ్యామల గురువారం ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిని తరగతి గదిలోకి రానీయకుండా బయట నిలబెట్టి ఇబ్బంది పెట్టారని తెలిపారు. పైగా టీసీ ఇస్తామని బెదిరించారని, తమ కుమారుడు డిప్రెషన్‌కు లోనవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై ఎంఈవో రవీందర్‌ను సంప్రదించగా, పాఠశాలకు వెళ్లి విచారణ చేశామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక అందిస్తామన్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

మందమర్రిరూరల్: పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలోని బతుకమ్మ ఘాట్ వద్ద రెండు రోజుల క్రితం లభ్యమైన నల్ల పోచమ్మ తల్లి విగ్రహానికి భక్తులు గురువారం బోనాలు సమర్పించారు. కాలనీవాసులంతా ఏకమై షెడ్డు నిర్మించి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు.

ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గురువారం ఎన్నికల వేళ వ్యవహరించాల్సిన బాధ్యతలపై హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేకపోతే సాంకేతికపరంగా ఫిర్యాదులు చేయవచ్చని, ఈ సందర్భంగా సీ–విజిల్, సువిధ యాప్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై ఆంక్షలు విధించామన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

భీమిని: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో జవహర్ లాల్ ప్రకటించారు. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. అరగంట ఆలస్యంగా ఎంపీడీవో, అధికారులు వచ్చారు. ఎంపీపీ రాజేశ్వరి హాజరు మినహా మిగతా సభ్యులు, అధికారులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని టౌన్–1 ఏరియా లైన్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. చింతలగూడెం, బట్టిగూడెం, గాంధీచౌక్, అసుపత్రి ఏరియా, చెరువుకట్ట, శివాలయం, ఎమ్మెల్యే కాలనీ, కొటబొగుడ, బ్రాహ్మణవాడ, మదునం పోచమ్మ, గ్రంథాలయం, శ్రీలక్ష్మి రైస్‌మిల్, దాల్ మిల్, ఎంఆర్‌ఆర్ గార్డెన్ ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ అప్‌డేట్‌పై సమావేశం

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఐదు కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థుల ఆన్‌లైన్ అప్‌డేట్‌పై గురువారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ముఖ హాజరు, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, చేయడంతోపాటు, రిజిస్టర్‌లోని విద్యార్థుల సంఖ్య ఆన్‌లైన్‌తో సమానంగా ఉండాలని ఎంఐఎస్ నగేశ్ సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శంకర్‌గౌడ్, చిన నర్సయ్య, సుదర్శన్, విజయలక్ష్మి, రాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

కాసిపేట: మద్దిమాడ పంచాయతీ కాంగ్రెస్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భైర్నేని గోపాల్, అధ్యక్షుడిగా సోమని కిష్టయ్య ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు వేముల కృష్ణ తెలిపారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. మాజీ మండల అధ్యక్షుడు తిరుపతి, ఎంపీటీసీ పార్వతి మల్లేశ్, శంకర్, ఓసీసీ కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షుడు అన్నం కుమార్, కనకరాజు, షాకీర్, రషీద్, ఖదీర్, ఖలీల్, ఇస్మాయిల్, వేణు ఉన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే సంక్షేమం



గ్యారంటీ పథకాలను వివరిస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డు హమాలివాడ, 20వ వార్డులో గురువారం ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి ప్రేమ్ సాగర్‌రావును గెలిపించాలని కోరారు.

తాండూర్‌లో మేరీ మాటీ- మేరీ దేశ్



మట్టి కలశంతో అధికారులు

తాండూర్: మండలంలో గురువారం అధికారులు మేరీ మాటీ–మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు మేరీ మాటీ –మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 15 పంచాయతీల్లో మట్టి సేకరించారు. మట్టి కలశాన్ని తయారు చేసి జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఐకేపీ ఏపీఎం పోమానాయక్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'రఘునాథ్‌కే టికెట్ ఇవ్వాలి'

దండేపల్లి: మంచిర్యాల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు టికెట్ ఇవ్వాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. దండేపల్లిలో గురువారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. రఘునాథ్ గత ఎన్నికల్లో పోటీచేసి ఓడినా నియోజకవర్గ ప్రజల మధ్య ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. నిత్యం ప్రజా సేవ చేస్తున్న రఘునాథ్‌కు టికెట్ ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కాసిపేట: మండలంలోని కోమటిచేను పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎంఏ అలీం గురువారం పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. నర్సరీని పరిశీలించి నవంబర్1 నుంచి మొక్కలకు నీరు పోయాలని, పిచ్చిమొక్కలు తొలగించాలని తెలిపారు. ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని బట్టిగూడెం కాలనీకి చెందిన పాలితపు సురేశ్ కుమార్తె చిన్నారి ఇషిక జ్వరంతో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతుంది. వైద్యం కోసం రూ.4 లక్షలు ఖర్చువుతుందని వైద్యులు తెలిపారు. రెక్కాడితే డొక్కాడని సురేశ్ కుటుంబ పరిస్థితి. విషయం తెలుసుకున్న చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు రూ.11 వేల ఆర్థికసాయాన్ని వారికి అందజేశారు. పూర్వ విద్యార్థులు రెవెల్లి మహేశ్, కొండ సురేశ్, చింతల లక్ష్మణ్, అట్టెం సందీప్, జుల్ఫికర్, రవికుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన పలువురు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే తనయుడు విజిత్‌రావు వారికి పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో రైతు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



గొల్లపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

నెన్నెల: గత తొమ్మిదేళ్లలో బెల్లంపల్లి నియోజకవర్గంలో రూ.కోట్లతో చేసిన అభివృద్ధిని చూసి తనను మూడోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రజలను కోరారు. గురువారం ఆయన మైలారం, గొల్లపల్లి, జోగాపూర్, గన్‌పూర్, నందులపల్లి గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల సమయంలో డబ్బులతో వచ్చి హామీలు ఇచ్చే వివిధ పార్టీల నాయకుల మాటలను నమ్మొద్దన్నారు. ఎంపీపీ రమాదేవి జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఆత్మ చైర్మన్ సున్నం రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు సింగతి రాంచందర్, ఇందూరి రమేశ్ ఉన్నారు.

పరామర్శ

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం గ్రామంలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గురువారం బాధిత సంద్ర భీమయ్య కుటుంబీకులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున సహాయసహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు కర్ర శంకర్, శ్రీరామరావు, రంగరావు, ఇప్ప బాపు, అల్లి ప్రశాంత్, కాళ్ల సురేష్ పాల్గొన్నారు.

- సంద్ర భీమయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు మాధవరపు నర్సింగరావు, నేతరి స్వామి పరామర్శించారు. తక్షణ సాయం కింద ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు అందించారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



చెన్నూర్: దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



జైపూర్‌లో దహనం చేస్తున్న నాయకులు

చెన్నూర్: రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దహనం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల పట్ల కాంగ్రెస్ కపట ప్రేమ బట్టబయలైందన్నారు. గతంలో రైతులకు 24 గంట కరెంట్ సరఫరాపై వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి ఈమారు రైతులు లబ్ధిపొందే పథకాన్నే నిలిపివేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జెడ్పీటీసీ మోతె తిరుపతి, సర్పంచులు బుర్ర రాకేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరవీందర్‌రావు, నాయకులు తిరుపతి, గోదారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

భీమారం: మండల కేంద్రంలోని జాతీయరహదారి వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రైతుబంధుపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుకు నిరసనగా కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు రాష్ట్ర నాయకుడు చెర్కు సరోత్తంరెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణకు రాజకీయ పక్షాల నాయకులు, అభ్యర్థులు విధిగా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్యలతో కలిసి సువిధ ఆన్‌లైన్ పోర్టల్‌లో అనుమతి విధానాలపై వివరించారు. అనుమతి తీసుకున్న తర్వాత ఏయే నియమాలు పాటించాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఎన్నికల అధికారులు, పోలీసులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని కోరారు.

'రైతుబంధు ఆపేయాలనడం సరికాదు'



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

జన్నారం: రైతుబంధు ఆపేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడం సరికాదని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ చంద్రశేఖర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కాంగ్రెస్ నాయకులు రైతు బంధు ఆపేయాలనడం సరికాదన్నారు. రైతు వ్యతిరేక పార్టీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్, ఎంపీటీసీ రియాజొద్దీన్, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, నాయకులు జనార్దన్, శ్రీనివాస్, రాజునాయక్, శంకర్, నర్సింహులు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దొనబండ సబ్‌సెంటర్ సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం వైద్య, ఆరోగ్యశాఖ మంచిర్యాల డివిజన్ అధికారులు సందర్శించారు. సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్‌లు రోగులతో మాట్లాడారు. సబ్ సెంటర్‌లో అందిస్తున్న వైద్యసేవల వివరాలు, పొందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ ప్రమాణాల ధ్రువీకరణ కోసం నిర్వహించాల్సిన రిజిస్టర్లు, రికార్డుల గురించి సిబ్బందితో చర్చించారు. ఏడు రకాల సేవలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని సలహా ఇచ్చారు. హెచ్‌ఈఓ రఘుపతి, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఆశకార్యకర్తలు ఉన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారుఏరియా ప్రాంతంలో ఓ వ్యక్తి అక్రమంగా తీసుకెళ్తున్న మద్యం బాటిళ్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. బజారుఏరియా ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బెల్లంపల్లి మండలం బుధాకలాన్‌కు చెందిన గడ్డం తిరుపతి వద్ద ఉన్న 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. తిరుపతి గత కొంతకాలం నుంచి గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ నాయకులు అధైర్యపడొద్దు

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నరాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ అసెంబ్లీ టికెట్ సీపీఐ కాకుండా కాంగ్రెస్ అభ్యర్థికే కేటాయిస్తారని అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు సూచనలు అందాయన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు కాట్రాల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ బాపు, ఆరె బాపు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని గెర్రెకాలనీలో బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోపై కాలనీవాసులకు గురువారం అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు జడల మల్లేశ్, కొప్పుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేమనపల్లి: మండలంలోని కేతన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ శంకర్, బీఆర్‌ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు సంతోష్, నారాయణ, వేణు, అంకులు, వెంకటేశ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, సర్పంచ్ దుర్గక్క ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పారు. సర్పంచ్ గాలి మధు, మాజీ సర్పంచులు శంకర్‌గౌడ్, మధుకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధాశ్రమంలో బాల గంగమ్మ కుమారి(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆనంద నిలయం కేర్ టేకర్ సదానందం పాల్గొన్నారు.

పంటలు పరిశీలన



చెన్నూర్ మండలం లింగంపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏఈవో సాయికృష్ణ

నెన్నెల: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పత్తి, వరి పంటలను క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తిలో ఎదుగుదల లోపించిందని పూత, గూడలు రాలుతుందన్నారు. నీటి వసతి ఉన్నవాళ్లు ఉదయం పూట నీరందించి ఎరువులు వేసుకోవాలన్నారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు, కంకినల్లి ఉధృతం అధికంగా ఉందని నివారణకు కోరాంట్రోనిప్రోల్ 10 శాతం నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. వరి పూత దశలోకి వస్తే పదిరోజుల వరకు పిచికారి వాయిదా వేసుకోవాలని సూచించారు. ఏఈవో రాంచందర్, రైతులు ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఏఈవో సాయికృష్ణ గురువారం వరి పంటలను పరిశీలించారు. పంటలో ఆకుచుట్టు పురుగు ఎక్కువగా ఉందని, దీని నివారణకు కార్టాప్‌హైడ్రోక్లోరైడ్‌ను పిచికారి చేయాలని సూచించారు. అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారి చేయాలన్నారు. సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్‌ను పిచికారి చేయాలని రైతులకు వివరించారు.

'అధికారమిస్తే మరింత అభివృద్ధి'

శ్రీరాంపూర్: బీఆర్‌ఎస్‌కు అధికారం ఇస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్.విజిత్‌రావు తెలిపారు. మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నడిపెల్లి దివాకర్‌రావును గెలిపించాలని కోరుతూ గురువారం ఆయన నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్, పట్టణ ఉపాధ్యక్షుడు సంతోశ్‌చారి, స్థానిక వార్డు కౌన్సిలర్ లక్ష్మి, కౌన్సిలర్లు పంబాల గంగా ఎర్రయ్య, వంగ తిరుపతి, బండి పద్మ, కురిమిళ్ళ అన్నపూర్ణ, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి,నాయకులు డి.అన్నయ్య, తిరుపతి, రజిత, రాజేశం, శ్రీనివాస్ ఉన్నారు.